# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

OCTOBER - 2017

సంవత్సర చందా రూ. 50/-

# బైబిలు లెక్చర్‌షిప్
## సత్యవాణి - కాకినాడ

స్థలము : క్రీస్తు సంఘము
7-9-35, సాంబమూర్తి వీధి,
సత్యవాణి, కాకినాడ - 533 004.

తేదీలు : 2017 నంబరు 7 నుండి 10వ తేదీ వరకు
మంగళ, బుధ, గురు, శుక్రవారములు

సమయం : ఉదయం 10.00 గంటలకు
మధ్యాహ్నం 2.00 గంటలకు
సాయంకాలం 7.00 గంటలకు

ప్రఖ్యాతిగాంచిన స్వదేశ, విదేశ సహోదరులు వాక్యపరిచర్య చేయుదురు. భోజనం, వసతి ఉచితం. మొదటి దినమున రూ.20/-లు మాత్రము రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవలెను. ఎవరి దారి ఖర్చులు వారే భరించవలెను. అందరికీ స్వాగతం. మీ కుటుంబ స్థానిక సంఘ సమేతముగా రండి, ఆత్మీయ విందులో పాల్గొనండి. మీ కొరకు ఎదురుచూచు చున్నాము.

బ్రదర్. జాషువా గూటం
బ్రదర్. లక్ష్మి గూటం
Ph : 0884 - 2363722
98489 98547

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

| సంపుటి - 39 | అక్టోబరు - 2017 | సంచిక -3 |
|---|---|---|

## యేసును పైకెత్తుట

## ( Lifting up Christ )

యేసు తాను ఏవిధముగా మరణము పొందవలసి యుండెనో సూచించెను, "నేను భూమిమీద నుండి పైకెత్తబడిన యెడల అందరిని నాయొద్దకు ఆకర్షించు కొందునని చెప్పెను" (యోహాను 12:32). యేసు క్రీస్తు చెప్పిన ఈమాట బహుశ తన శత్రువులకు హాస్యాస్పదముగా కనబడి యుండును. ఒక చిన్నపల్లెటూరి నుండి వచ్చిన ఈ మనుష్యుడు, రాజకీయముగా గాని, ఆర్థికముగా గాని ఏవిధమైన బలము లేని ఇతడు తన యొద్దకు అందరినీ ఆకర్షించు కొందుననుమాట వారికి ఆశ్చర్యము గానే యుండెను.

యోహాను 8:28లో కూడ పైకెత్తబడుటయను మాటలు మనకు కనబడుచున్నవి. "కావున యేసు - మీరు మనుష్య కుమారుని పైకెత్తినప్పుడు నేనే ఆయనననియు, నాయంతట నేనే యేమియు చేయక, తండ్రి నాకు నేర్పినట్టు ఈ సంగతులు మాటలాడు చున్నాననియు మీరు గ్రహించెదరు" అని చెప్పెను. యేసు యొక్క నిజస్వరూపమును ఆయనను పైకెత్తినప్పుడే మనుష్యులు గ్రహించెదరని యేసు ఇక్కడ పలికెను.

నీకొదేమను పరిసయ్యునితో యేసు మాట్లాడుచు ఇట్లు చెప్పెను : "అరణ్యములో మోషే సర్పమును

ఏలాగు ఎత్తెనో, ఆలాగే విశ్వసించు ప్రతివాడును నశింపక ఆయనద్వారా నిత్యజీవము పొందునట్లు మనుష్య కుమారుడు ఎత్తబడవలెను. దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అను గ్రహించెను" (యోహాను 3:14-16).

పైకెత్తబడుటను గూర్చి యేసు చెప్పిన ఈ మాటలన్నియును ఆయన సిలువ మరణమును గూర్చి ముందుగనే ఆయన చెప్పిన మాటలు. ఆ దినాల్లో సిలువపై మరణించుట కంటె అధోగతి మరొకటి లేదు. అయితే యేసు సిలువపై తన మరణమును ఒక గొప్ప విజయముగా చేయబోవుచున్నారు.

అరణ్యములో మోషే సర్పమును యెత్తుటను గూర్చి యేసు ఇక్కడ చెప్పెను. ఆ సంఘటనను పాత నిబంధనలో సంఖ్యాకాండము 21వ అధ్యాయములో మనము చూడగలము. ఇశ్రాయేలీయులు అరణ్యములో ప్రయాణము చేయుచు దేవునికిని మోషేకును వ్యతిరేకముగా సణుగు కొనిరి. అందుకు యెహోవా ప్రజల లోనికి తాపకరములైన సర్పములను పంపెను; అవి ప్రజలను కరువగా ఇశ్రాయేలీయులలో అనేకులు చనిపోయిరి. చివరకు ప్రజలు తమ పాపముల నొప్పుకొని మోషే యొద్దకు వచ్చి ఈ సర్పమును తొలగించునట్లు యెహోవాను వేడుకొనుమనిరి. మోషే ప్రజలకొరకు ప్రార్థన చేయగా యెహోవా-నీవు తాపకరమైన సర్పము వంటి ప్రతిమను చేయించి స్తంభము మీద పెట్టుము; అప్పుడు కరవబడిన ప్రతివాడును దానివైపు చూచి బ్రతుకునని మోషేకు సెలవిచ్చెను". మోషే అట్లుచేయగా సర్పపుకాటు తినిన ప్రతివాడు ఆ యిత్తడి సర్పమును నిదానించి చూచినందున బ్రదికెను (సంఖ్యా 21:4-9).

మోషే అరణ్యములో సర్పమును ఏలాగు ఎత్తెనో ఆలాగే తానుకూడ ఎత్తబడుదునని యేసుక్రీస్తు ముందుగానే తెలియజేసెను. ఈ రెండు సందర్భములలోను పాపమువలన మరణము మానవులను భయకంపితు లను చేయుచున్నది. ఈరెండు సందర్భములలోను దేవుడు తన కృప చొప్పున ఒక విరుగుడును అనుగ్రహించెను. ఈరెండు సందర్భము

లలోను మానవులు రక్షింపబడ వలెనంటే ఆ 'విరుగుడు' పైకెత్త బడవలెను.

అయితే యేసు ఎట్లు పైకెత్త బడెను? అని మనము ఇప్పుడు ప్రశ్నించుకొనవచ్చును. ఆయన సిలువ పై పైకెత్తబడెను. అవును. నిజము. నేను పై కెత్తబడిన యెడల అందరిని ఆకర్షించుకొందును అని ఆయన చెప్పిన ఒక వారము దినములలోనే ఆయన సిలువ వేయబడెను. ఆ సందర్భమును భక్తుడైన మార్కు ఇట్లు లిఖించెను : "వారు గొల్గొతా అనబడిన చోటునకు ఆయనను తీసికొనివచ్చిరి. గొల్గొతా అనగా కపాలస్థలమని అర్థము. ఆయనను సిలువవేసినప్పుడు పగలు తొమ్మిది గంటలాయెను. అప్పుడు ఆ మార్గమును వెళ్ళుచున్న వారు తమ తలలూపుచు, ఆహా, దేవాలయమును పడగొట్టి మూడు దినములలో కట్టువాడా, సిలువమీద నుండి దిగి నిన్ను నీవు రక్షించుకొను మని చెప్పి ఆయనను దూషించిరి. మధ్యాహ్నము మొదలుకొని మూడు గంటల వరకు ఆ దేశమంతయు చీకటి కమ్మెను" (మార్కు 15: 22-23).

అవును, అది ఈ లోకములో అతి భయంకరమైన చీకటి ఘడియ ఆయెను. గాని అది దేవుని దేదీప్యమాన సమయము. యేసును సిలువపై కెత్తించిన వారెవరు? ఆయన శత్రువులు. నిజమే, గాని ఒక విధముగా చూస్తే దేవుడే మానవుల పాప పరిహారార్థము నిమిత్తము యేసును సిలువపై కెక్కించెను. అందుకు యేసు ఇట్లనెను : "నేను దానిని మరల తీసుకొనునట్లు నా ప్రాణము పెట్టుచున్నాను; ఇందు వలననే నా తండ్రి నన్ను ప్రేమించు చున్నాడు. ఎవడును నా ప్రాణము తీసికొనడు; నా అంతట నేనే దానిని పెట్టుచున్నాను; దానిని పెట్టుటకు నాకు అధికారము కలదు, దానిని తిరిగి తీసుకొనుటకు నాకు అధికారము కలదు. నా తండ్రివలన ఈ ఆజ్ఞ పొందితిని" (యోహాను 10:17,18).

అందరిని క్రీస్తు తన యొద్దకు ఎట్లు ఆకర్షించుకొనును? ఆయన ప్రేమను బట్టి ఆకర్షించుకొనును. వారి కొరకు తన ప్రాణమును బలి యిచ్చిన వాని ప్రేమను తప్పక ఈలోకము అర్థము చేసికొనగలదు. "తన

స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టు వానికంటె ఎక్కువైన ప్రేమ గలవాడెవడును లేడు. నేను మీ కాజ్ఞాపించువాటిని చేసిన యెడల, మీరు నా స్నేహితులై యుందురు" అని యేసు మనలను హెచ్చరించు చున్నారు (యోహాను 15:13,14).

యేసును సిలువవేయుటలో పాపి యెడల దేవుని ప్రేమ వ్యక్తపరచ బడుటయేగాక పాపము యెడల దేవుని మహాఉగ్రత కూడ బయలుపరచబడి యున్నది. దేవుని దృష్టిలో పాపము ఎంత ఘోరమైనదంటే దాని ఉపశమనము (విమోచన) నిమిత్తము తన అద్వితీయ కుమారుని మరణము అవశ్యమాయెను.

యేసుయొక్క శత్రువులు ఆయనను సిలువపై కెత్తి ఆయనను చంపి సమాధి చేసినను దేవుడు ఆయనను సమాధి నుండి మూడవ దినమున పైకెత్తెను. యేసుక్రీస్తు మరణించి తిరిగి లేచినందున ఆయన సజీవుడైన రక్షకుడాయెను. "మరణము ఆయనను బంధించియుంచుట అసాధ్యము గనుక దేవుడు మరణ వేదనలు తొలగించి ఆయనను లేపెను'' (అపొ.కా. 2:24). పునరుత్థానుడైన యేసును గూర్చి అపొస్తలులు "ఈయేసును దేవుడు లేపెను; దీనికి మేమందరము సాక్షులము'' అని సాక్ష్యమిచ్చిరి (అపొ.కా. 2:32).

యేసును మృతులలో నుండి పై కెత్తిన తరువాత దేవుడు ఆయనను పరలోకమున కెత్తెను. ఆయన పరలోకమునకు చేర్చుకొనబడి దేవుని కుడి పార్శ్వమున ఆశీనుడయ్యెను అని మార్కు 16:19లో వ్రాయబడియున్నది. ఆయన దేవుని కుడిపార్శ్వమును ఆశీనుడై ఇప్పుడు తన రాజ్యమైన సంఘమును పాలించుచున్నారు. "తన శత్రువుల నందరినీ తన పాదముల క్రింద ఉంచువరకు ఆయన రాజ్యపరిపాలన చేయుచుండవలెను. కడపట నశింపజేయబడు శత్రువు మరణము" (1కొరింధి 15:25,26).

యేసు పరలోకమున కెత్తబడక ముందు తన అపొస్తులులతో "మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి

నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తివరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:19,20).

యేసు చెప్పిన రీతిగ సర్వలోకమందున్న సర్వమానవులు ఇప్పుడు ఆయన యొద్దకు ఆకర్షింప బడుచున్నారు. నాయొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి నిత్తును అని ఆయన చెప్పు చున్నారు. మన పాపముల నిమిత్తము సిలువపై కెత్తబడిన రక్షకుని యొద్దకు మనము విధేయత చూపుచు వచ్చిన యెడల మనలను ఆయన పరలోకమునకు ఎత్తును. అందుకే "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనొల్లవానికి శిక్ష విధించబడునని" ఆయన చెప్పుచున్నారు. నీవు క్రీస్తును నమ్ముకొంటివా?

## రాజైన మనష్షే
## ( King Manasseh )

హిజ్కియా కుమారుడైన మనష్షే యూదాదేశమును పాలించుటకు క్రీ.పూ.690లో ప్రారంభించెను. అప్పటికి అతని వయస్సు 12 సంవత్సరములై యుండెను. సాధారణంగా ఆ వయస్సులో యున్న బాలుడు గొప్ప బాధ్యతను వహించుటకు సిద్ధముగా యుండడు. అయితే మనష్షే యొక్క మనుమడగు యోషీయా 8 సంవత్సరముల వయస్సు నందే రాజై మంచిగా పాలించెను. మంచి రాజాయెను. గాని మనష్షే అయితే జ్ఞానమును, నీతిని అనుసరించుటకు నిరాకరించెను.

**మనష్షే యొక్క దుర్మార్గత :**

యెరూషలేములో మనష్షే 55 సంవత్సరములు పాలించెను. అతని పాలన కాలమంతయు దుష్టత్వముతో నిండియుండెను. "అతడు యెహోవా దృష్టికి చెడుతనము జరిగించుచు ఇశ్రాయేలీయుల యెదుట నిలువకుండ యెహోవా వెళ్ళగొట్టిన జనములు చేసినట్లు హేయక్రియలు చేయుచు వచ్చెను". "ఇశ్రాయేలీయుల యెదుట నిలువకుండ యెహోవా లయము

చేసిన జనములు జరిగించిన చెడుతనమును మించిన చెడు తనమును చేయునట్లు మనష్షే వారిని రేపెను" (2రాజులు 21:2,9). అతడు "తన తండ్రియైన హిజ్కియా పడగొట్టిన ఉన్నతస్థలములను అతడు తిరిగి కట్టించి బయలు దేవతకు బలిపీఠములు కట్టించి ఇశ్రాయేలు రాజైన అహాబు చేసినట్లు దేవతా స్థంభములు చేయించి నక్షత్రములకు మ్రొక్కి వాటిని పూజించుచుండెను". అతడు తన కుమారుని అగ్నిగుండము దాటించి జ్యోతిషములను శకునము లను వాడుకచేసి, యక్షిణిగాండ్రతోను సోదెగాండ్రతోను సాంగత్యముచేసెను. ఈ ప్రకారము అతడు యెహోవా దృష్టికి బహుగా చెడుతనము జరిగించుచు ఆయనకు కోపము పుట్టించెను. యెహోవా దావీదునకును అతని కుమారుడైన సొలొమోనునకును ఆజ్ఞ ఇచ్చి ఈ మందిరమును ఇశ్రాయేలు గోత్రస్థానములలో నుండి నేను కోరుకొనిన యెరూషలేము నందు నా నామము నదాకాలము ఉంచుదునని సెలవిచ్చిన యెహోవా మందిరమందు తాను చేయించిన అషేరా ప్రతిమను ఉంచెను" (2 రాజులు 21:16).

అటుతరువాత యూదా నాశన మగుటకు మనష్షే గొప్ప కారకు డయ్యాడు. "యూదా రాజైన మనష్షే ఈ హేయమైన కార్యములు చేసి తనకు ముందున్న అమోరీయులను మించిన చెడునడత కనబరచి తానుపెట్టుకొనిన విగ్రహముల వలన యూదా వారు పాపము చేయుటకు కారకుడాయెను. కావున ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా సెలవిచ్చునదేమనగా వినువారి రెండు చెవులు గింగురుమను నంత కీడు యెరూషలేము మీదికిని యూదా వారి మీదికిని రప్పించుచు నేను షోమ్రోనును కొలిచిన నూలును అహాబు కుటుంబికులను సరిచూచిన మట్టపుగుండును యెరూషలేము మీదికి సాగలాగుదును. ఒకడు పళ్లెమును తుడుచునప్పుడు దాని బోర్లించి తుడుచునట్లు నేను యెరూషలేమును తుడిచివేయుదును" (2రాజులు 21:11-13).

అట్లయినను రాజైన మనష్షే యొక్క అంత్యక్రియలు ఘనముగానే నిర్వహించబడినట్లు 2 రాజులు 21:18ని బట్టి మనము తెలిసికొన

గలము. "మనష్షే తన పితరులతో కూడ నిద్రించి ఉజ్జా యొక్క తోటలో తన నగరు దగ్గర సమాధి చేయబడెను. అతని కుమారుడైన ఆమోను అతనికి మారుగా రాజాయెను (2రాజులు 21:18).

**మారుమనస్సు నొందిన మనష్షే :**

తన దుష్కార్యములను బట్టి మనష్షే మారుమనస్సు నొందెను. అతడు మరణించిన తరువాత మారు మనస్సునొందెనా? కానే కాదు, అది అసాధ్యము. ఏలయనగా "మనష్యు లొక్కసారే మృతిబొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). ప్రతి మనుష్యుడు ఈ భూమి పై ఒక్కసారే జీవించును, మరణించును. మనం మరణించిన తరువాత మారు మనస్సుకు, పాపక్షమాపణ నొందుటకు వున్నతరుణములేమీ ఉండవు. ఈ లోకంలో బ్రదికి యున్నప్పుడే మనం నిత్య గమ్యాన్ని ఎంచుకోవాలి.

మనష్షే యొక్క మారుమనస్సును గూర్చి 2వ రాజుల గ్రంథములో వ్రాయ బడలేదు గాని 2వ దినవృత్తాంతముల గ్రంథములో ఇట్లున్నది. "యెహోవా మనష్షేకును అతని ప్రజలకును వర్తమానములు పంపినను వారు చెవి యొగ్గకపోయిరి. కాబట్టి యెహోవా అష్షూరు రాజు యొక్క సైన్యాధిపతులను వారిమీదికి రప్పించెను. మనష్షే తప్పించుకొని పోకుండ వారతని పట్టుకొని, గొలుసులతో బంధించి అతనిని బబులోనునకు తీసికొని పోయిరి. అతడు శ్రమలో ఉన్నప్పుడు తన దేవుడైన యెహోవాను బతిమలాడుకొని తన పితరుల దేవుని సన్నిధిని తన్నుతాను బహుగా తగ్గించుకొని ఆయనకు మొరలిడగా ఆయన అతని విన్నపములను స్వీకరించి యెరూషలేమునకు అతని రాజ్యములోనికి అతని తిరిగి తీసికొనివచ్చినప్పుడు యెహోవా దేవుడై యున్నాడని మనష్షే తెలిసికొనెను" (2దినవృత్తాంతములు 33:10,11). అష్షూరీయులు తమ బందీల ముక్కులకు కొక్కెనము లను తగిలించి లాగుకొనిపోయెడి వారు.

బబులోనులో బందీగా యుండి శ్రమలు పెట్టబడుచున్నప్పుడు మనష్షే పూర్వీకుడైన సొలొమోను వ్రాసిన పాఠమును నేర్చుకొన్నాడు : "విశ్వాస ఘాతకుల మార్గము కష్టము" (సామె 13:15). మారుమనస్సు నొందాడు.

తన వంకరమార్గములను సరి జేసుకొనుటకు మనష్షే పని చేయ మొదలుపెట్టాడు. అతడు దావీదు పురము యొక్క బయట గోడలను కట్టించాడు, బలమైన సేనాధిపతులను నియమించాడు. యూదాదేశమును బలిష్టముగా చేయసాగాడు (2 దినవృ 33:14). అతడు విం(త దేవతలను తీసివేసాడు. తాను కట్టించిన బలి పీఠములన్నిటిని తీసి పట్టణము బయటికి వాటిని లాగివేయించాడు. యెరూషలేము దేవాలయములో తాను నియమించిన విగ్రహమును తీసివేసాడు. బలిపీఠములను పడ గొట్టాడు (33:15). "ఇదియు గాక అతడు యెహోవా బలిపీఠము బాగుచేసి దాని మీద సమాధాన బలులను కృతజ్ఞతార్పణలను అర్పించుడని యూదావారికి ఆజ్ఞయిచ్చెను'' (33:16). యివి నిజమైన మారు మనస్సు యొక్క ఫలములు.

మనష్షే తన జీవితమును నిజముగా మార్చుకొన్నాడు! అయితే తాను చేసిన కీడంతటిని అతడెన్నడు నిర్మూలించలేకపోయాడు. అతని కుమారుడైన ఆమోను తన తండ్రి యొక్క దుర్మార్గతను మరింత కొనసాగించాడు. అతని సంస్కరణలను అనుసరించలేదు.

"ఆమోను ఏల నారంభించి నప్పుడు ఇరువది రెండేండ్ల వాడై యెరూషలేములో రెండు సంవత్సరములు ఏలెను. అతడు తన తండ్రియైన మనష్షే నడిచినట్లు యెహోవాదృష్టికి చెడునడతనడిచెను. తన తండ్రియైన మనష్షే చేయించిన చెక్కుడు విగ్రహము లన్నిటికి బలులు అర్పించుచు పూజించుచు తన తండ్రియైన మనష్షే గుణపడినట్లు యెహోవాసన్నిధిని పశ్చాత్తాపుడు కాకను, గుణపడకను ఈ ఆమోను అంతకంతకు ఎక్కువ ద్రోహ కార్యములను చేయుచువచ్చెను" (2 దినవృత్తాంతములు 33:21-23).

యూదాదేశము తక్షణమే పతనమైపోలేదు గాని ఆదేశము యొక్క ఆత్మీయపునాదులకు మనష్షే ఘోరమైన రీతిగా హానిచేసెను. ప్రవక్తయైన యిర్మియా ఇట్లువ్రాసాడు. "అప్పుడు యెహోవా నాకీలాగు సెలవిచ్చెను. మోషేయు సమూయేలును నా యెదుట నిలబడినను ఈ ప్రజలను అంగీ

కరించుటకు నాకు మనస్సుండదు, నా సన్నిధిని ఉండకుండ వారిని వెళ్ళ గొట్టుము..యూదా రాజైన హిజ్కియా కుమారుడగు మనష్షే యెరూషలేములో చేసిన క్రియలన్నిటిని బట్టి భూమి మీదనున్న సకల రాజ్యములలోనికి యిటు అటు చెదరగొట్ట బడినట్లు వారిని అప్పగించు చున్నాను'' (యిర్మియా 15:1,4). యెరూషలేమును, యూదాయు క్రీ.పూ. 586లో పతనమయ్యెను. నిజముగా ''ఒక పాపాత్ముడు అనేకమైన మంచిపనులను చెరుపును" (ప్రసంగి 9:18).

**క్రియలకు పర్యవసానముండును :**

''మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు, మనుష్యుడు యేమి విత్తునో ఆ పంటనే కోయును. ఏలాగనగా తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరము నుండి క్షయమను పంటకోయును, ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మ నుండి నిత్య జీవమను పంటకోయును" (గలతీ 6:7,8). విత్తడం కోయడమును గూర్చిన సూత్రములో భౌతిక, నైతిక ఆత్మీయభాగములున్నవి. మరియు మనము ప్రభావితము చేయు వారందరు ఆ సూత్రములో ఇమడ్చబడియున్నారు. సాధారణంగా మనం ఎక్కువ ప్రేమించే వ్యక్తులపైనే మన జీవిత ప్రభావ ముండును.

**మనష్షే నుండి మనకు పాఠము :**

మనష్షే జీవితము నుండి మనం యేమి నేర్చుకొనగలము? మన పాపములను గూర్చి నిత్యము మనం అపరాధులముగా యుండనక్కర్లేదని అతని జీవితం మనకు నేర్పుచున్నది. ఒకడు యేసుప్రభువు నందు విశ్వాస ముంచి, పాపముల విషయమై మారు మనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందగా దేవుడతని గతపాపములన్నిటిని క్షమించును (మార్కు 16:16; అపొ.కా. 2:38; 8:35-39, 22:16; గలతీ 3:26,27). ఎంత ఘోరపాపి నైనను ప్రభువు క్షమించును.

''అన్యాయస్థులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా? మోసపోకుడి. జారులైనను విగ్రహారాధకులైనను, వ్యభిచారులైనను, ఆడంగితనము గలవారైనను, పురుష సంయోగు

లైనను, దొంగలైనను, లోభులైనను, త్రాగుబోతులైనను, దూషకులైనను, దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులుకానేరరు. మీలో కొందరు అట్టివారైయుంటిరి గాని ప్రభువైన యేసుక్రీస్తు నామమునను, మన దేవుని ఆత్మ యందును మీరు కడుగబడి పరిశుద్ధ పరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడితిరి" (1 కొరింథీ 6:9-11).

మరల పౌలు ఇట్లు చెప్పుచున్నాడు. "పూర్వము దూషకుడను, హింసకుడను, హానికరుడనైన నన్ను తన పరిచర్యకు నియమించి నమ్మకమైన వానిగా ఎంచినందుకు నన్ను బలపరచిన మన ప్రభువైన క్రీస్తుయేసునకు కృతజ్ఞుడనై యున్నాను. తెలియక అవిశ్వాసము వలన చేసితిని గనుక కనికరింప బడితిని. మరియు మన ప్రభువు యొక్క కృపయు క్రీస్తుయేసునందున్న విశ్వాసమును ప్రేమయు అత్యధికముగా విస్తరించెను. పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనది యునై యున్నది. అట్టివారిలో నేను ప్రధానుడను. అయినను నిత్యజీవము నిమిత్తము తనను విశ్వసింపబోవు వారికి నేను మాదిరిగా ఉండులాగున యేసుక్రీస్తు తన పూర్ణమైన దీర్ఘ శాంతమును ఆ ప్రధాన పాపినైన నాయందు కనుపరచునట్లు నేను కనికరింపబడితిని" (1తిమోతి 1:13-16).

ప్రభువునకు విధేయత చూపుటకు ఆలస్యము చేయకూడదు. మారుమనస్సు పొందుటకు ఆలస్యము చేసేకొలది మన ఆత్మలకు సంభవించే ప్రమాదము ఎక్కువగుచుండును. గనుక నీ బాల్యదినముల యందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము (ప్రసంగి 12:1). మన పాపముల పర్యవసానమును మనము తొలగించ లేము. గాని ఎక్కువ హాని, ఎక్కువ దు:ఖము కలుగకండ చూడగలము. గనుక దేవుని చిత్తమునకు నేడే మనము లోబడవలెను. మరియు క్రీస్తుయేసు నందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానము కొరకు ఎదురు చూచుచు పరుగెత్తవలెను (ఫిలిప్పీ 3:14).

-రోయస్ ఫ్రెడరిక

# సంఘపెద్దల యొక్క పని

## ( The work of Elders )

క్రొత్త నిబంధనలో పెద్దల యొక్క పని వివరించబడినది. తన విధులను గూర్చి నేనెరుగనని పెద్దయైన వాడెన్నడు చెప్ప వీలుపడదు. సంఘ సభ్యులు కూడ పెద్దల యొక్క పనిని గూర్చి సంశయపడవీలులేదు. వారి విధులు అనేకములు, భారభరితములు. వారు దేవుని గృహనిర్వాహకుల వలె పని చేయవలెను (1తిమోతి 3:5). స్థానిక సంఘము యొక్క ప్రతి పనిని పర్యవేక్షించుట వారి విధియైయున్నది (అపో.కా. 20:28). మరియు వారు మందను కాయువారైయున్నారు (1పేతురు 5:1-3). దేవుడు నియమించిన అర్హతలను పెద్దలు కలిగి యుండవలెను. తత్ఫలితముగా దేవుడు నియమించిన విధులను వారు నిర్వర్తించగలరు.

వారు పనిచేయు ప్రదేశము స్థానిక సంఘమునకు మించినది కాదు. స్థానిక సంఘము తమలో నుండియే పెద్దలను ఏర్పరచుకొనును గనుక వారు ఆ సంఘమునకు సేవ చేయుదురు, వారిని పాలించుదురు. క్రొత్తనిబంధనలో చెప్పబడిన సంఘ పెద్దలు వారు చెందిన స్థానిక సంఘమునకే పరిమితులైన వారు (అపో.కా. 20:17; ఫిలిప్పీ 1:1; యాకోబు 5:14). స్థానిక సంఘము నుండియే వారు ఏర్పాటు చేయబడుట వలన వారు ఆస్థానిక సంఘమునకే పరిమితియైనవారు (అపో.కా. 6:3).

స్థానిక సంఘము వారి నాయకత్వమును మించి ఎదగలేదు. అర్హతలు గల పెద్దలుండుట ఎంత ప్రాముఖ్యము? ఒక స్థానిక సంఘము యొక్క ఆత్మీయాభివృద్ధి, పరిపక్వత, క్రైస్తవ్యమును గూర్చిన అన్ని అంశములలోను శక్తివంతముగా యుండుట ఇవన్నియును అర్హత గల పెద్దలపై ఆధారపడియుండును. పెద్దల యొక్క పని ఆత్మలతో కూడి యున్నట్టిది. అది ప్రజల యొక్క నిత్యత్వముతో ముడిపడి యున్నది.

రొట్టెల వాడు రొట్టెలను కాల్చును. పోలీసు వాడు భద్రతను సమకూర్చును. బోధకుడు బోధించును. పెద్దలు సంఘమును పాలించును. పెద్దలు పెద్దరికము చేయుదురు! పెద్దలకు దేవుడు నియమించిన పని స్థానిక సంఘములో ఈయబడినది. పెద్దలు హితబోధ విషయమై జనులను హెచ్చరించుటకును, ఎదురాడు వారి మాట ఖండించుటకును శక్తిగలవారై యుండవలెను (తీతు 1:9). పెద్దలు తమకప్పగింపబడిన ఆత్మలను కాయువారు (హెబ్రీ 13:17). వారు పాలించువారు. పాలించుటకు అధికారము పొందిన వారు. పెద్దలు క్రొత్త సిద్ధాంతములను ప్రవేశ పెట్టరాదు. గాని తమ సంఘసభ్యులకు బైబిలు బోధను సక్రమముగా వివరింప బాధ్యులు.

క్రీస్తుసంఘము ఒక డెమోక్రసీ కాదు. దానిలో ప్రతిసభ్యుడు సంఘ వ్యవహారాలను నడుపుటకు వీలు పడదు. ప్రభువు సంఘము దేవుని చిత్తము వలన సంఘశిరస్సు క్రీస్తుచే పాలింపబడును. పెద్దల ద్వారా ఆయన సంఘమును పాలించును. పెద్దలు నిరంకుశులు కాకూడదు. వారు క్రూరులు నిరంకుశులు కాకూడదు. ప్రజలపై ప్రభుత్వము చెలాయించుచు నిర్దయులు కాకూడదు. గాని వారు తండ్రులవలె ప్రేమతో, తెలివితో ప్రజలను పాలించాలి. ఒకరు నాయకత్వము వహించాలి. ఒకరు నడిపించాలి, ఒకరు క్రమశిక్షణను అలవరచాలి. పెద్దలు సంఘమును పాలించాలని పరిశుద్ధాత్ముడు బోధించు నప్పుడు, స్థానికసంఘము వారికి లోబడి యుండాలని కూడ బోధించు చున్నాడు.

**మిమ్మును గూర్చి మీరే జాగ్రత్తపడుడి (అపొ.కా. 20:28).**

పెద్దలు తమ మట్టుకు తాము దేవుని దృష్టిలో సరిగయున్నారో లేదో పరీక్షించుకొనవలెను. అప్పుడు వారు సంఘమును సరిగ నడిపించగలరు. పెద్దలు ఒక యూనిట్‌గా ఐక్యత కలిగి సంఘము యెదుట పనిచేయవలెను.

పెద్దలలో ముఖ్యపెద్ద, సీనియర్‌పెద్ద, జూనియర్‌పెద్ద మొ॥గు స్థానములు లేనేలేవు. అందరిపైనా మొండిగా వ్యవహరించే వానికి అందులో తావులేదు. మరియు తమకు స్థానిక సహోదరులు లోబడుట లేదనే యభిప్రాయమును పెద్దలు కలిగించ కూడదు. ఒకరిమీద ఒకరు సణుగుట, సంఘములో పార్టీలుగా చీలికలు కలిగించుటను అపొ. పౌలు నిశితముగా ఖండించాడు (అపొ.కా. 20:29,30). దేవుని సంఘ పెద్దలు స్వీయ క్రమశిక్షణ నలవరచుకొంటారు.

**మందను గూర్చి జాగ్రత్తపడుడి (అపొ.కా. 20:28) :**

పెద్దలు స్థానిక సంఘములోని ప్రతి సభ్యుని గూర్చి జాగ్రత్తపడాలి. అవసరమయితే అక్రమముగా ప్రవర్తించు వానిని మందనుండి వేరు చేయాలి. అట్లుచేయకపోతే మంద అంతయు చెల్లాచెదురగును. సంఘ సభ్యులు విషయంలో తగురీతిగా క్రమశిక్షణ చర్యలు పెద్దలు అనుసరిస్తూ యుండాలి. తద్వారా పాపులు రక్షించబడ్తారు; మిగతావారు పాడవకుండా రక్షించబడ్తారు. పెద్దలు స్థానిక సంఘములోని ప్రతివ్యక్తిని బాగుగా ఎరిగి యుండాలి.

**మందను కాయవలెను (1పేతురు 5:1,2) :**

"మీ మధ్యనున్న దేవుని మందను పై విచారణ చేయుచు దానిని కాయుడి" యని సంఘపెద్దలకు పేతురు సలహాయిచ్చాడు. తాను కూడ పెద్దలలో ఒకడైయుండెను. గొర్రెల కాపరి యొక్క ముఖ్యమైన పని మందను మేపుటయే. మందను మేపుచు అతడు వాటిని కాయును. స్థానిక సంఘపెద్దలు సంఘసభ్యులకు ఆత్మీయాహారమునందియ్యవలెను. అనారోగ్యకరమైన అసత్యబోధ నుండి వారు మందను తప్పించి హిత బోధ లభించునట్లు వారు ప్రయత్నము చేయుదురు. తద్వారా సభ్యులు ఆత్మీయముగా పరిణతి చెందుదురు.

పెద్దలు స్థానిక సంఘమును

ఆత్మీయముగా పోషించాలి. సంరక్షించాలి (అపొ.కా.20:28). ఈ విషయంలో అవసరమైన చర్యలను వారు తప్పకగైకొనాలి. "యావత్తు మందను గూర్చియు, మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి"యని పౌలు పెద్దలను హెచ్చరించాడు. పెద్దలు ఆయా సువార్తికులను, బోధకులను, యితర సంఘపెద్దలను, మిషనెరీలను పిలిపించి వాక్యమును వినిపించి స్థానిక సంఘమును ఆత్మీయముగా బలపరచాలి. జ్ఞానయుక్తమైన సలహాలను గైకొని పాటించుటలో దోషమేమియులేదు.

**పై విచారణ చేయుడి :**

స్థానిక సంఘమునకు పై విచారణ చేయులేక పర్యవేక్షించు బాధ్యతను పెద్దలు కలిగియున్నారు. స్థానిక సంఘములోని ప్రతిసభ్యుని ఆత్మీయ జీవితమును గూర్చి పెద్దలు పర్యవేక్షించాలి. మందనుండి తప్పి పోవుచున్నట్లగుపడువారిని గూర్చి జాగ్రత్త కలిగి వారు తొలగిపోకుండా హెచ్చరించాలి. పెద్దలు దేవుని గృహ నిర్వాహకులు. స్థానిక సంఘమును పర్యవేక్షించుచు వారు మంచి గృహ నిర్వాహకులుగా పనిచేయాలి. సభ్యులు కూడ పెద్దల యొక్క పర్యవేక్షణకు యిష్టపూర్వకముగా సహకరిస్తే స్థానిక సంఘమునకు మరింత మేలు కలుగును.

**మాదిరిగా యుండాలి(1పేతురు 5:3):**

సహోదరులు వారిని అనుకరించునట్లు పెద్దలు మాదిరిగా యుండాలి. దేవుడు కోరునట్లుగా పెద్దలుంటే వారి మాదిరిని బట్టి సంఘములోయున్న స్త్రీ పురుషులు తమ జీవితంలో పాపము లేకుండా ప్రవర్తింపగలరు (1కొరింథీ 11:1). పెద్దలు మాదిరిగా యుండాలి. నిజానికి మాదిరికంటె ఎక్కువగా యుండాలి. వారి స్థానిక సంఘమును కాయు కాపరులు వారు. అయితే బలిమి చేతకాదు (1పేతురు 5:3) వారు తమ అధికారమును

దుర్వినియోగం చేయకూడదు. మిగతా సంఘమంతయు వారిని బట్టి అనుకరించులాగున పెద్దలు మందకు మాదిరిగా జీవించాలి. వారు ప్రధాన పెద్దయైన యేసుకు జవాబీయవలసిన వారని మరచిపోకూడదు (1పేతురు 5:4).

**తోడేళ్ళను కనిపెట్టాలి (అపో.కా. 20:29-30) :**

పెద్దలు అబద్ధ బోధచేయు ఉపదేశకులను, బోధకులను కనిపెట్టాలి. అట్టివారు సంఘమును హితబోధ నుండి దూరము చేయుదురు (రోమా 16:17,18; 2తిమోతి 4:3). సంఘమునకు లోపలి నుండి గాని, బయట నుండి గాని ప్రమాదము రావచ్చును. ఎఫెసులో యున్న సంఘపెద్దలకు అబద్ధ బోధకులు తమలో నుండియే బయలు దేరుదురనే హెచ్చరికను పౌలు చేసాడు (అపో.కా. 20:29). బోధకులు ఉపదేశకులు యేమి బోధించు చున్నారో దానిని గూర్చి పెద్దలు జాగ్రత్తగా మెలకువగా యుండాలి. తద్వారా సహోదరులు అబద్ధ బోధ నుండి సంరక్షింప బడుదురు. త్రోవతప్పిపోవుచున్న, బలహీనమైన బోధను గమనించగానే పెద్దలు చలించి చర్య తీసుకొంటే హానికలుగ కుండా పెద్దలు జాగ్రత్త వహించగలరు. వివిధ తరగతులలో, బైబిలు క్లాసులలో యేమి ఉపదేశించ బడుచున్నదో దానిని పెద్దలు పర్యవేక్షిస్తూ యుండాలి.

**వదరబోతుల యొక్కయు, మోసగాళ్ళ యొక్కయు నోళ్లుమూయింపవలెను (తీతు 1:10-11):**

సువార్త బోధకుల వేషములో వచ్చి అబద్ధ బోధలు చేయువారిని పెద్దలు గుర్తించవలెను. ఈ అబద్ధ బోధకులు తమ చాకచక్యముతో సంఘమును పాడుచేయుదురు. అసత్యాన్ని సాహసముతో పెద్దలు ఎదుర్కొనాలి. ఈ అసత్యబోధలు బహిరంగముగా గాని, ప్రైవేటుగా గాని ప్రచారము చేయబడుచుంటే, సంఘ సంక్షేమము నిమిత్తము అట్టి బోధకుల

నోళ్లను పెద్దలు సత్యవాక్యముతో మూయించవలెను. ప్రతిబోధకుడు, ఉపదేశకుడు కూడ తాను ఉపదేశించుచుండగా పెద్దలు లేచి అతని ప్రశ్నించవచ్చునని ఎరిగియుండాలి (యాకోబు 3:1).

**బలహీనులను సంరక్షించవలెను :**

ప్రతి స్థానిక సంఘములోను క్రీస్తులో శిశువులైనవారుంటారు. వారు తమ్మునుతాము సంరక్షించుకోలేరు. పెద్దలు ఆత్మీయముగా బలహీనులైన వారిని సంరక్షించాలి. బలహీనులైన వారు ఆత్మీయముగా బలపడునట్లు పెద్దలు వారిని గూర్చి తగుచర్యలు గైకొనాలి (హెబ్రీ 5:12-14).

**పెద్దలు రోగుల కొరకు ప్రార్థించాలి, వారి అవసరములను తీర్చాలి (యాకోబు 5:14) :**

ప్రతి క్రైస్తవుడు మిగతా క్రైస్తవులను గూర్చి బాధ్యత కలిగియున్నాడు. ప్రతి క్రైస్తవుడు రోగియైయున్న క్రైస్తవుని కొరకు ప్రార్థించి, అతనికి సహాయపడు బాధ్యత కలిగియున్నాడు. అయినను పెద్దలు ఈ బాధ్యత నుండి తప్పించుకొనకూడదు. రోగులకు తగిన సహాయము వారు అందించాలి. లేదా వారి తరపున ఆ భాద్యతను వారు ఇంకొకరికి అప్పగించవచ్చును.

**సంఘసమస్యలను ఆలోచించాలి, పరిష్కరించాలి (అపొ.కా.15:6) :**

సంఘవ్యవహారములను గూర్చి ఎవరో ఒకర్రు బాధ్యతవహించాలి. ఈ సమస్యలు భౌతికం కావచ్చును. లేదా ఆత్మీయము కావచ్చును. వాటి పరిష్కార బాధ్యతను దేవుడు పెద్దల భుజములపై యుంచారు. ఏది యోగ్యమో అట్లు చేయు పరిజ్ఞానమును దేవుడు పెద్దలకిచ్చియున్నారు.

**బోధకులను ఉపదేశకులను ఎంపిక చేసి ఆ పని వారికి పెద్దలు అప్పగించాలి (1 తిమోతి 4:14) :**

తిమోతిని పెద్దలు నియమించారు. సాధారణంగా స్థానిక సంఘ సువార్తికులను పెద్దలు నియమిస్తారు. వారు నియమించిన బోధకులను

గూర్చియు, ఉపదేశకులను గూర్చియు బాధ్యత కలిగియుందురు.

**సంఘస్థుల యొక్క ఆత్మలను కాపుదల చేయాలి (హెబ్రీ 13:17) :**

సంఘములో యున్నవారి ఆత్మలను గూర్చిన బాధ్యత చాలా ప్రాముఖ్యమైనది. ఈ గొప్ప భారమును పెద్దలు మోయుదురు. స్థానిక సంఘ సభ్యులు పెద్దలకు సహకరిస్తే ఆ భారము తేలికయగును. పరలోక మార్గము వైపు సంఘమును నడుపు చుండగా పెద్దలకు స్థానిక సంఘసభ్యులు సహకరించవలెను. వారు "దు:ఖముతోకాక, ఆనందముతో చేయునట్లు వారి మాటవిని వారికి లోబడియుండుడి" (హెబ్రీ 13:17). యెహెజ్కేలు 33:7-16లో చెప్పబడి నట్లు పెద్దలు స్థానిక సంఘ ఆత్మలను కాయుచుండవలెను. దుర్మార్గుల యొక్క పాపమును గూర్చి వారిని హెచ్చరించే బాధ్యత పెద్దలు కలిగియున్నారు. పెద్దలు తమ పర్యవేక్షణకై ఉంచబడిన ఆత్మలకు బాధ్యులు.

స్థానిక సంఘములో యున్న ప్రతి ఆత్మకు సరిపడినంత ఆత్మీయాహారము లభించునట్లు పెద్దలు వ్యవహరించాలి. వారి కాపుదలకు అప్పగింపబడిన ఆత్మల విషయమై వారు గృహనిర్వాహకులు. వారు ప్రభువు దరపున సంఘమును నడిపించుచున్నవారు. నిజమైన గొర్రెల కాపరి తన మందలో నున్నవారందరినీ ఎరుగును. వారెవరో, ఎంతమందో, ఎక్కడ నివసింతురో, వారి ఆత్మీయస్థితి ఎట్లున్నదో మొదలగు సంగతులన్నీ పెద్దలు ఎరిగియుందురు.

– లూయిస్ రష్మోర్


సత్యవాక్కు సాలు చందా కట్టారా? లేనిచో ఇప్పుడే రూ.50/-లు ఎమ్.ఒ. చేసి మీ పత్రిక పొందుచు యుండుడి.

**సత్యవాణి**

**7-9-35**, సాంబమూర్తి వీధి,
కాకినాడ – **533 004.**

# పరలోక సహాయము కొరకు ఆవేదన పడు హృదయములు

## ( Hurting Hearts Hunting Heaven's Help )

యేమి చేయాలో తోచనప్పుడు నీవేమి చేస్తావు? నీకోనలహా ఇయ్యగోర్తాను - ప్రార్థించు!

నెహెమ్యా అదే పనిచేసాడు. ఆ కథ నీకు తెలుసు కదా! నెహెమ్యా రాజు దగ్గరకు వెళ్ళాడు. నీకేమి కావాలని రాజు అతనినడిగాడు. నెహెమ్యా చేసింది నాకు చాల యిష్టము. రాజుకు జవాబీయక ముందు అతడు ప్రార్థించాడు. ఆ సందర్భాన్ని గూర్చి వినుము : "అప్పుడు రాజు ఏమి కావలసి నీవు మనవి చేయుచున్నావని నన్నడుగగా, నేను ఆకాశమందలి దేవునికి ప్రార్థన చేసి రాజుతో నీ సముఖమందు నేను దయ పొందిన యెడల, నా పితరుల సమాధు లుండు పట్టణమును తిరిగి కట్టునట్లుగా నన్ను యూదా దేశమునకు పంపుదని వేడుకొనుచున్నానని నేను మనవి చేసి యుంటిని" (నెహెమ్యా 2:4-5).

నీవు రాజు ముందు నిలబడి యుండగా అతడొక ప్రశ్నవేసాడనుకో అతడు నీ జవాబు కొరకు కనిపెట్టు చున్నాడు, అతడు చాల తీరికలేని రాజు, చేయవలసిన యుద్ధాలున్నాయి, జయించవలసిన సామ్రాజ్యములు, పట్టణములు వున్నాయి. గాని నిన్నొక ప్రశ్నవేసాడు, నీవేమి చేస్తావు?

నెహెమ్యా ప్రార్థన చేసాడు. అదొక దీర్ఘ ప్రార్థన కాదు. 15 నిమిషాల ప్రార్థన కూడ కాదు. "ప్రభువైన దేవా నేటి దినము కొరకు నీవనుగ్రహించిన దీవెనల కొరకు కృతజ్ఞత చెల్లించుచున్నానని" చెప్పు ప్రార్థన అది కాదు. అది క్లుప్తమైనది, ఖచ్చితమైనది, స్వల్పవ్యవధి కలది. వెంటనే చేసిన ప్రార్థన. సహాయము కొరకు ఆవేదన పడువాని ప్రార్థన అది.

పరలోకసహాయము త్వరలో లభించాలని నీవెన్నడైనా తలంచావా? అట్టి అవసరము నీకు ఎన్నడైనా

కలిగిందా? బహుశా యేసును గూర్చి నీవొక మిత్రునికి బోధించుచున్నావేమో. నీ యజమానితో సంభాషించు చున్నావేమో? లేదా వెనుకంజ వేయుచున్న సంఘస్థుని హెచ్చరించు చున్నావేమో, లేదా ఒక మిత్రునితో భేదాభిప్రాయము కలిగియున్నావేమో? లేదా నీ బిడ్డలను సరిగపెంచుటకు సహాయము కోరుచున్నావేమో. దేవుని దగ్గర దీర్ఘకాల మొరపెట్టుటకు నీకంత వ్యవధి ఉండకపోవచ్చును." "దేవా నాకు దయచేసి సహాయముచేయుము. నాకు నీ నడిపింపు, జ్ఞానము అవసరం" అని నీవు కోరుచుండ వచ్చును. ఇట్టి సందర్భాల్లో నెహెమ్యా చేసింది చెయ్యి -ప్రార్థించు. యేమీ పని చేయలేనప్పుడు ప్రార్థించు. ఇంకా యేమీ ప్రయత్నించక ముందు ప్రార్థించు. ఆవేదనపడు హృదయం నీకుంటే పరలోక సహాయాన్ని నీవు అభ్యర్థిస్తావు. ప్రార్థించు.

మన ప్రార్థనలు ఆత్మీయముగా యుండుటకు అవి సుదీర్ఘ ప్రార్థనలు కానవసరంలేదు.

- కీత్ పార్కం

## స్తెఫను

## ( Stephen )

యెరూషలేములో ఆదిమ సంఘములో విధవరాండ్ర పరిచర్య నిమిత్తము ఏర్పరచబడిన ఏడుగురిలో స్తెఫను ఒకడు. అతడు శక్తివంతమైన బోధకుడు, విశ్వాసధీరుడు. అద్భుత శక్తివంతమైన వాడయ్యాడు. అపొస్తులుల కార్యములు 6,7 అధ్యాయాల్లో అతని గూర్చి మనం చదువగలము.

అపొ.కా. 6వ అధ్యాయములో లూకా అతనిని గూర్చి చాలా క్లుప్తముగా గొప్పగా వర్ణించాడు. అతడు విశ్వాసముతోను పరిశుద్ధాత్మతోను నిండుకొనిన వాడని చెప్పబడినది (55). మరియు అతడు జ్ఞానముతో నిండుకొనినవాడు (3వ, 10వ). అతడు కృపతోను బలముతోను నిండు కొనినవాడు (8వ) మరియు వెలుగుతో

నింపబడినవాడు (15వ). 7వ అధ్యాయమును బట్టి అతడు వాక్యముతోను, ధైర్యముతోను నిండుకొనిన వాడని కూడ మనం చెప్పగలము.

అలెగ్జాండర్ వైట్ అనునతడు స్తెఫను గూర్చి ఇట్లు చెప్పాడు :

రాళ్ళు రువ్వి స్తెఫనును చంపుట వలన ఆదిమ సంఘము ఇంకొక పౌలును కోల్పోయింది. స్తెఫను ఎంత కృప, దైవజ్ఞానము గల వాడంటే బ్రదుకనిచ్చిన యెడల అతడు సాధించ లేనిది యేదీ వుండకపోయేది. అతని మనో వికాసము, తన కాలపు నాటి ఆచారముల నుండి వేరుచేయబడి అతడు ప్రదర్శించిన స్వేచ్ఛ అతని ధైర్యము, వాక్చాతుర్యము, నిష్కళంక ప్రవర్తన ఇవన్నీ అతనిలో మిళితమై యుండుట వలన స్తెఫను యొక్క ఔన్నత్యము, పరిచర్యలోను, ప్రమాదము లోను అతని ముందుగా యుంచినది. వీటన్నిటి విషయాల్లోను స్తెఫను గనుక బ్రతికి యుంటే, పౌలు, పేతురు, యాకోబు, యోహానులకంటే అతని ఘనత పెచ్చు పెరిగియుండును. ఇవన్నీ స్తెఫనును తన కాలము నాటి ప్రముఖునిగా నిలబెట్టినవి. అందువలన స్తెఫను పడగొట్టబడిన హతసాక్షి (Martyr)గావించబడిన ప్రథముడయ్యాడు.

"వారు అతనిని రాళ్ళతో కొట్టిరి. అతడు మోకాళ్ళూని ప్రభువా వారి మీద ఈ పాపము మోపకుమని గొప్ప శబ్దముతో పలికి నిద్రించెను. సౌలు అతని చావునకు సమ్మతించెను (అపో.కా. 7: 59-60).

- జేక్ హేరియన్



# సంక్షిప్త వార్తలు

2017 సెప్టెంబరు 2వ తేదీనాడు రిక్కీగూటం గారు అమెరికాలో జరిగిన పాలిషింగ్ ద పుల్‌పిట్ (PTP) లెక్చరర్‌షిప్‌లో హాజరై క్షేమముగా కాకినాడ తిరిగి చేరుకొని వెంటనే దేవుని పనిలో ప్రవేశించారు. అట్లే వారి తల్లి కబితాగూటం గారు సెప్టెంబరు 15వ తేదీ శుక్రవారం అమెరికా నుండి క్షేమముగా స్వగృహమునకు చేరుకొనిరి. అమెరికాలో వారి రెండవ కుమారుడు రోనీగూటం దంపతుల యొద్ద ఆమె ఒక నెల గడిపిరి. ఆమె కూడ PTPకి హాజరై గొప్ప బైబిలు పండితుల ఉపన్యాసములనాలకించి ఆత్మీయముగా లబ్ధిపొందిరి.

2017 సెప్టెంబరు 27,28,29 తేదీలలో తాళ్ళరేవులో యున్న క్రీస్తు సంఘము జరిపిన సువార్తకూటములలో జాషువాగూటం గారు మొదటిరోజున హాజరై చక్కటి వాక్యోపదేశముగావించిరి. రెండు, మూడు దినాలలో టి.జ్ఞాన సుధీర్ గారును, వేళంగిలో పనిచేయుచున్న శ్యామ్‌ప్రసాద్ గారును వాక్యోపదేశము చేసిరి. తాళ్ళరేవులో సోదరులు జాన్ విక్టర్‌గారు అనేక సంవత్సరములుగా సువార్తపని చేయుచు మంచిబలమైన సంఘమును తయారు చేయుటయే గాక, మరి రెండు మూడు గ్రామములలో కూడ పరిచర్య చేయుచు సంఘములను నాటుచున్నారు.

2017 సెప్టెంబరు 30వ తేదీ నాడు తుని మండలం తిమ్మాపురంలో జరిగిన మూడు దినముల సువార్తకూటములలోను ఒకరోజు మట్టుకు జాషువా గారు వాక్యపరిచర్య చేసిరి. అక్కడ సోదరులు యి. అబ్రహాము గారు వాక్యపరిచర్య చేయుచు తుని, తిమ్మాపురం, పాయకరావుపేటలో సువార్త చాటు చున్నారు.

2017 సెప్టెంబరు 25వ తేదీనాడు రిక్కీగూటం దంపతుల కుమార్తె జోఏన్ రోజ్‌లిన్ (Joann Roselyn) గారి మొదటి జన్మదిన వేడుక వారి గృహము యొద్ద ఘనముగా నిర్వహించబడెను. స్థానిక సంఘస్థులు, పట్టణప్రముఖులు, రోటరీక్లబ్బు వారు, బంధువులు మిత్రులు పెక్కుమంది హాజరై రిక్కీగూటం దంపతులను అభినందించిరి. జన్మదినము జరిపించుకొనుచున్న చిన్నపాపను ఆశీర్వదించిరి. సోదరులు వి. సుదర్శన్ రావ్ గారు వాక్యపరిచర్య చేసిరి. రక్షణ టి.వి. అధినేత బెన్హర్ గారు కూడ క్లుప్తప్రసంగము చేసిరి. జాషువాగూటం గారి ప్రార్థన అనంతరం అందరు చక్కటి విందులో పాల్గొని సంతోషించిరి.

నవంబరు 7,8,9,10 తేదీలలో కాకినాడలో జరుగబోవు బైబిలు లెక్చర్‌షిప్ కొరకు అన్ని ఏర్పాట్లు జరుగుచున్నవి. మీరును హాజరవుటకు ఏర్పాట్లు చేసికొనండి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.